# ముఖచిత్రం

'నిన్నరాత్రి కలమాత్రం వచ్చింది; నీవు రాలేదుగదే జవరాలా !—'

ఝామును ప్రొద్దుపోయింది ; మా యిల్లు మాటుమణిగింది :

తాతగారు, మండువా దగ్గిరగా, పట్టెమంచంమీద, తలక్రింద చేయి గుమ్మలించుకుని, పడుకున్నారు; అమ్మమ్మ, ఆ సరసనే, మర్యాదా అంత ఎడంగా, చాప పరుచుకుని, బొంతమీద బొంత తీర్చి దిద్దుకుని, తలక్రింద తాళంచెవులు, తలాగడ దిక్కున మరచెంబూ పెట్టి, నడుం నొప్పిగా రంగణ్ణి స్మరించే - ఆవలించి, అమ్మయ్యా - గా ఒరిగి ఒత్తిగిలింది:

తాతగారు, పనస చదివినట్లు పై వాక్యం అనగానే, అమ్మమ్మ ఆపసోపాలు మానేసి తనలో తాను నవ్వుకోవడం ప్రారంభించింది: నవ్వు ఆపుకోలేకుండానే—

'ఎందుకండీ, తీరిపడుకుని ఆలా కలవరిస్తారు? –' అంటూ లేచికూర్చునేందుకు ప్రయత్నిస్తూనే ఉంది, తాత గారు, చక్కలిగిలి అయినంత గందరగోళంగా లేచి కూర్చున్నారు.

పక్కగదిలోనే నేను పడుకున్నాను. ఏదో పుస్తకం నామీద పడుకుంది; నా అంతట నాకు ఎప్పుడూ రాత్రి నిద్ర రాదు. దీపం తగ్గించే దీవెన పుట్టింటికి వెళ్లింది –!

పెళ్ళాం అనేది అయోనిజ అయితే, ప్రతి మగ రాయడూ బ్రతికి పోతాడు కద! పుట్టిల్లంటూ ఉండగానే – చీటికీ మాటికీ ఆ యింటివారు రమ్మనడం – ఆ గాలి సోక గానే యీ పిల్ల – తల్లి, అమాంతం ముద్దులకూతురై అమ్మచెంగు పట్టుకువదలకుండా, కట్టుకున్నవాడిపోరు, కన్నవాడిపోరూ చెవిని పట్టకపోవడం – ఏతావతా అందరూ కట్టకట్టుకుపోవడం – ఆరగా ఆరగా ఆ ఆట లేకితనం పోయి, మళ్ళీ యిటు మళ్ళేలోగా – ఇక్కడ యీ నాధుడనేవాడు, ఒంటిపోచ జంధ్యమల్లే అఘోరించుతూండటం – ఇదంతా పుట్టిల్లంటూ ఒకటి ఉండటంమూలాన వచ్చిన అనర్థమేకద!

పోనీ, నీ మనసులో మమకారం కొద్దీ – పంపనంటా వనుకో – అందరూ కలిసి యిల్లు తీసి పందిరి వెయ్యరూ? ధారాపాతంగా కలకంఠి కంటి కన్నీరు నీ ఆవరణ యావత్తూ ఒలకదూ?

అప్పుడు నీవు చేయని తప్పుకు ఎలాగూ చెంపలు వేసుకోవడం తప్పదు.

తాతగారు ఎంత అదృష్టవంతుడు! ఆయన భార్య - అనగా అమ్మమ్మ - కాపురానికి వచ్చిన వెనువెంటనే, వాళ్ల పుట్టిల్లుఉన్న ఊరుకు ఉప్పెనవచ్చి, ఒక్క ఆ పుట్టిల్లంటూనే కాకుండా, దానికి ఏమాత్రమైనా సంబంధం అంటూ ఉన్న యిళ్ళు యావత్తూకూడా - అజాపజా లేకుండా గుటక వేసుకు పోవడంతో-తాతగారికి, అటువైపు బాధ ఉత్తరత్రా లేకుండా పోయింది; అది అలాఅయిపోయింది కదా అని ఎన్నడన్నా తలుచుకు గునిసేందుకన్నా తీరిక లేకుండా - తాతగారు సంసార పక్షంగా చక్కదిద్దుకుంటూ వచ్చారు - ఆయన అదృష్టం ఆయనిది :— నేను అసూయపడితేమాత్రం, ఇలా తప్ప మరోవిధంగా - తెల్లవారుతుందా ?

తాతగారన్నది విన్నాను: అమ్మమ్మ నవ్వగానే - మనకెందుకు పోనిద్దూ - తప్పు: చూడకూడదు - అనుకుంటూనే దొంగచూపు చూశాను-ఇద్దరూ ఎక్కడున్న చోటే ఉన్నారు - తాతగారి గడ్డం కేకలుమాత్రం, గాలి లేకపోయినా చూచాయగా రేగుతూన్నట్టు అనిపించింది:

'ఏమండీ - మంచినీళ్ళు కావాలా ?'

'ఆఁ ? - ఏమిటీ చోద్యం ! -' తాతగారు మునుపటి ఘన సత్తువగా అడిగారు: లేచి నిలుచుని, పరకాయిస్తూ -

'ఏమే వయ్యారీ - ఇరవైయేళ్ళ ఈ నడుమ ఏరాత్రి అయినా నాకు దాహం వేసినట్టు దాఖలా ఉందా ? ఉన్నట్టుండి - ఈ ఏదీ కానివేళ - ఇలా కొరకబోయినావేం ?'

తాతగారు, బహు వడుపుగా - త్రిభంగిగా - అమ్మమ్మ చెక్కిలిమీద కొనగోరుతో - - అలా అన్నాడు: ఆవిడ ఝుళుక్కున కులికి ఎన్నో మెలికలుగా నవ్వుకుంటూంది:

నాకు కోపం, నవ్వూ, విసుగూ వేసుకువచ్చింది; వీళ్ళు ఈ వేళప్పుడు ఇలా శివాలాడటం మొదలుపెట్టారేం; కృష్ణా రామా అంటూ, ఏ నడుం నొప్పితోనో పడుకోక - మూలుగుతూ!

అమ్మమ్మ గొంతు మళ్ళీ రవంత సడీ - చప్పుడూగా కిచకిచలాడుతూంది.

'అబ్బ! ఇ-ష్-ఊరుకోండి - ఇదెక్కడి అప్రదిష్టమ్మా! ఏమిటీ చేష్టలు? - పిల్లవాడు చూచిపోయేను!'

తాతగారు తెగించి నవ్వుతున్నాడు - తిట్టినట్టు అంటున్నాడు - 'చూస్తే - బాగుపడిపోయేను!'

అమ్మో! - ఆ వెన్నెల చూడు - ఆ నక్షత్రాలు చూడు! - ఎక్కడో మలయపర్వతాన్నుంచి అనేక వ్యయ ప్రయాసలకు ఓడ్చి, మనల నందరినీ ఉద్ధరించాలని ముంచెత్తడానికి వచ్చిన చల్లగాలిని చూడు—

ఈ వేళప్పుడు - మునుపు మనం ఇలాగే వున్నామూ? - నీవు మీ పుట్టింట వుంటే - నేను వుసూరుమంటూ, రొమ్ము మీద ఏ పుస్తకమో కప్పుకుని ఆపసోపాలు పడుతూ, గోడ మీది బల్లుల సరసాలు చూసి వులికిపడుతూ వుండేవాడినా? ఒక్కరోజైనా బీకుపోనిచ్చానా? ఎంత నిశి- రాత్రి అయినా, రెక్కలు కట్టుకు వాలేవాడిని కాదూ?"

ఇంతసేపటికి అర్థం అయింది నాకు తాతగారి ధోరణి- పండబారిన ఆ రతీమన్మథులు - వాళ్ళ మనసు నా మీద పదునుపెడుతున్నారు.

కసి తీర్చుకుంటున్నట్టు - తాతగారు ఉపదేశించినట్లే చేశాను: నేను మెసులుతూన్న అలికిడి, వాళ్ళకు సోక నీకుండా, - బట్టలు వేసుకుని వీధితలుపు దగ్గిరగా పెట్టి - హుటాహుటి బయలుదేరాను.

ప్రొద్దుపోయినమాట నిజమే-కాని, మా బావమరదికి పరీక్షలాయెను: వాడింకా కంట్లో వత్తులువేసుకుని చదువు తూనే వుంటాడు - బుద్ధి తెలిసినవాడు గనుక - నన్ను - నా రాకా చూసి మనసులో నవ్వుకున్నా, మామగారల్లే పట్టుకుని అనేది మొగాన అనేసి. నా పని ఎందునా గాకుండా చెయ్యడు: వాడినే బ్రతిమాలుకుంటే - మా పెళ్ళికూతుర్ని నిద్రలేపుతాడు - ఇహ ఆ తరువాత - 'సర్వమున్ ఆతని దివ్యకళా మయము-!'

కాని, ఇంత సంబరంపడుతూ వెళ్లిం తరువాత, వెళ్ళిన బులబాటం గుమ్మంలోనే బొప్పికట్టింది-అంత ప్రొద్దుపోయినా- వాడు అరుగుమీదే లేవిణీవేసి చదువుకుంటున్నాడు - వాళ్ళ అక్కయ్య మేలుకునే కూర్చుంది.

నిజంగా, ఇలవేలుపులందరూ నా పాలిట వున్నారని, ఉవ్వెత్తున గంతేశాను: గుమ్మంలోకి అడుగువేశాను—

వాడు - తలఎత్తి చూసి - ఏం బావా - ఎక్కడనుంచి!- అని చదువుకునే వాక్యంలో కలిపి ఉచ్చరించాడు: వాళ్ల అక్కయ్య నేను మడి అనుకున్నట్లు ఎగిరి దూరంగా గంతేసింది:

తెల్లబోయి - గుండె గతుక్కుమని ఆ వంక చూశాను: ఎంతో జాలిగా - పెదవి కదలించింది.

అంతే! తిరిగి ఎలా ఇలు చేరుకున్నానో - నాకే తెలియదు - కాని, తలవంచుకుని, ఇంట్లోకి పోయేందుకన్నా వీలులేకుండా - తాతగారు, అరుగుమీద చుట్టకాల్చుకుంటూ, నా కోసం ఎదురుచూస్తున్నట్టు కూచున్నారు:

అడుగు అక్కడే ఆగిపోయింది:

తాతగారు, అతి సజావుగా—

'ఏం రా నాయనా! వచ్చావూ!' అన్నారు. రాక పోయినా బాగుండేది: తెల్లవాళ్లూ - ఊరంతా బలాదూరు తిరిగినా బాగుండేది: ఓ చాప ఇవతల వేయించుకుని నేనూ, ఆ అరుగుమీదే మనికితే బాగుండేది కాని—

తాతగారు - నన్ను పొదివిపట్టుకుని సరసను కూర్చోబెట్టుకున్నారు:

'నన్ను అడిగితే - నేను చెప్పకపోదునా? ఈ కాలం వాళ్ళకు ససిగా కూడికలూ, తీసివేతలూ అయినా రావాయె- ఏ నెలకా నెల యావజ్జీవమూ ముప్ఫైరోజుల్లో మూడు ప్రొద్దులు అలా వుంచాల్సిందే:—'

నవ్వేందుకు నాకు ధైర్యం చాలలేదు - ఇంతలో అమ్మమ్మ గుమ్మంలోకి వచ్చింది - మా సరసం చూసింది.

'పోనిద్దురూ! వాడినేం వేధిస్తారండీ! - వడసారం పసివాడు'. అంటూ సర్ది చెప్పబోయింది - తాతగారు, నమళ పారాయణ చేస్తున్నట్టు -

'పసితనాన వంటపట్టకపోతే - మనసు బోసిపోదుటే అమ్మా: - ఔనుగాని, ఇది, తాతామనుమల వరుస! - నీవు నిష్క్రమించు -' అంటూండగానే ఆవిడ ఇంకా ఏం సరసం రువ్వుతాడో అని లోపలికి దూసుకున్నాది - మిగతా పారాయణ నా పాలబడ్డది.

'కంటికి కన్ను అంటిపెట్టుకుని ఎన్ని యుగాలైనా గడప వచ్చునే - ఎందుకు వచ్చేశావోయ్ - వచ్చి ఇక్కడ దేవర బావుకునే దేమిటోయ్ -

నా మనుమరాలి కళ్ళు వాల్మీకి వర్ణించాడురా, నాన్నా! నా తపస్సు ధారపోశాను: నీకు దక్కించాను కాని- ముడిగట్టుకున్నావ్! - బ్రాహ్మడివి!'

తాతయ్య రాసిక్యం - నే నెప్పుడూ కళ్ళకు అద్దుకునేదే! ఆయన ఆలా చీల్చి చెండాడుతున్నా - నన్ను ఎంతో ఆప్యాయనంగా వెన్ను నిమురుతూన్నట్టు వుంది: ఇవాళ తప్పు చేస్తేనేమో - నాలాటి అజ్ఞానులు రేపు తరించేది అనిపించింది -

'ఊఁ! ఇక పోయి పడుకో, ఆహితాగ్నీ! నీతో కూచుంటే, వెన్నెల నెలా తెలాపోతుంది - మా కన్నె కుమారి - కన్నులపండువు చేయాలి!' అని తాతగారు -

గదమాయింపుగా లేచారు - నేను చెర వదిలించుకున్నట్టు - లోపలికి దూకపోయినాను. ఆయన నవ్వుతూ చెయ్యి వడిసి పట్టుకుని -

"రేపూ ఇంతే అనుకునేవ్ ! తెల్లవారిన తరువాత - పల్లది, తల ఇక్కడే ఆరబెట్టుకుంటుందిలే ?' అని జాజిపొద కదిలినట్టు నవ్వాడు - నన్ను వదిలేశాడు.